
## బ్రేక్ స్టోరి

# అవలంబం

**యర్రగుంట్ల వరలక్ష్మిదేవి**

ఈ పవిత్ర భారతదేశంలో రెండు మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వింత మనస్తత్వం గల మనుష్యుల కథ – ఓ కాపురం కథ – విషపూరిత కాంక్షలు గల ఓ కుటుంబం – అందులో బ్రతకాల్సనే పేరాశ పడ్డ ఓ యువతి కథ.

విజయవాడలోని ఓ అమ్మాయికి, హైదరాబాద్‌లోని ఓ అబ్బాయికిచ్చి పెళ్ళి చేసేరు. వధూవరులిద్దరూ గ్రాడ్యుయేట్స్. వరుడు గవర్నమెంట్ ఉద్యోగి. వధువుకి ఏ ఉద్యోగం లేదు. అమ్మాయి సామాన్యంగా వుంటుంది చ డానికి, అబ్బాయి బాగానే వుంటాడు.



పెళ్ళి ముందు అమ్మాయి గురించి అన్నీ నిజాలే చెప్పేరు. అబ్బాయి గురించి అన్నీ అబద్ధాలే చెప్పేరు. అబ్బాయి వ్యసనాలేమీ తెలియజెప్పలేదు. బహు ఉత్తముడు అన్నారు. కాపురానికి వెళ్ళిన తరువాత సరోజకు ఆ ఇంట్లోని వారందరి మనస్తత్వం క్రమేపీ తెల్పింది. మామగారు ఏదో ప్రయివేటు కంపెనీలో పని చేసి రిటైరయి కొడుకు వద్దే వుంటున్నాడు. అతనికి పెన్షను లేదు. వచ్చిన గ్రాట్యుటీ, ప్రావిడెంటు ఫండు డబ్బును దాచుకున్నాడు. కొడుకునూ ఏమీ అడగక పోయినా, ఇంటి ఖర్చుకు ఏమీ ఇవ్వడు. అతడు సాయంత్రం అయిదయేసరికి అలా బయటకు పోయి, క్లబ్బులో పేకాటాడి రాత్రి తొమ్మిది గంటలు దాటాక ఇంటికి వస్తాడు. గెలుస్తే నవ్వు ముఖంతో తిరిగొస్తాడు. ఓడిపోతే రుసరుసలాడుతుంటాడు. ఏమైనా భార్య దుర్గమ్మకు ఎదురుపడి జవాబివ్వడు.

సరోజ అత్తగారు దుర్గమ్మ బయట అందరి వద్ద మంచి మనిషి అనిపించుకోవడానికి ప్రయత్నిస్తూ, ఇంట్లో మాత్రం నిజరూపం చూపుతుంటోంది. ఆమెకు మొదటి నుండి కోడలంటే పడదు. ఏవో సూటిపోటి మాట లంటుంటేగాని ఆవిడకు తోచదు. ఆమెకు వంతపాడడానికి ఆమె కూతురు పెళ్ళికాని జ్యోతి వుంది. ఇంట్లో ఏదైనా రగడ జరగగానే చాల నేర్పుగా మంటను ఎగదోస్తుంటుంది. పెళ్ళై తమింటికి ఎన్నో ఆశలతో వచ్చిన తోటి ఆడదాన్ని చూస్తే పెళ్ళికాని జ్యోతి కెందుకో ఆ ద్వేషం!

ఇక సరోజ భర్త నాగరాజు మొదట భార్యతో కొన్నాళ్ళు అతి ప్రేమతో వ్యవహరించేడు. క్రమేపీ ఆ ప్రేమను వ్యక్తపరచడం కష్టమై తన నిజ ప్రవర్తనకు వచ్చేసేడు. మొదటి ఆరు నెలలు ముచ్చటగానే గడిచేయి. అంటే భార్యతో అప్పుడప్పుడూ సినిమాలకు, బజారుకు వెళ్ళడం, ఇంటా బయటా సఖ్యంగానే మాట్లాడుకోడం. అప్పుడు అత్తగారేమీ కల్పించుకోలేదు.

తరువాత మొదలైంది అసలు కథ. నాగరాజు చీటికి మాటికి భార్యపై బుస్సుమనే వాడు. ఓ నాడు నాగరాజు డబ్బు అత్యంత అవసరమై తల్లిని అడిగేడు–

“అమ్మా! ఈ నెల నా ఖర్చు లెక్కువయేయి. ఓ నూరు రూపాయిలు అప్పుగా ఇవ్వవే”

“అయ్యో! నెలాఖరున నాదగ్గర మాత్రం అంత డబ్బు ఎక్కడుందిరా? అదిగో నీ భార్యనే అడగరాదు, వాళ్ళ నాన్న గత నెలవచ్చినప్పుడు దానికేదో ఇచ్చినట్లున్నాడు”

"మా నాన్నగారు చీరకొనుక్కో మని రెండు వందలిచ్చేరండి, గావి మీ అబ్బాయి గారు అవసరమైం దని గత నెలే నా దగ్గర నుండి ఆ డబ్బును తీసుకున్నారండి"

"ఏమిటీ! ముష్టి రెండు వంద లిచ్చి పోయేడా? అంత తక్కువ కట్నమిచ్చిన వాళ్ళు ఏ అవ సరమౌతుందో అని, అబ్బాయి పేరున వెయ్యడం ఇష్టం లేకపోతే నీ పేరుపైనైనా కనీసం ఓ పదివే లైనా బ్యాంకులో వేసి ఆ పాసు బుక్కును నీకివ్వొద్దూ? ఎంత పిసినారులే! పోనీ మీ నాన్నకు ఓ సారి రాసి చూడు".

"అదేమిటండీ - మా వాళ్ళు మీతో మాట్లాడి కుదుర్చుకున్న తరువాతే కదా ఆ పాతిక వేల కట్నం మీకిచ్చేరు. నా తరువాత మరో ఇద్దరు అమ్మాయిలకు మా నాన్న పెళ్ళి చెయ్యాలి. కట్న మెంతో పెళ్ళి ఖర్చు అంత అవు తోంది. ఈ రోజుల్లో ఇంకో పదివేలంటే ఎక్కడ నుండి తేగ లరండి?"

"ఏమి కూసేవే! ముష్టి పాతికవేలిచ్చి ఎంతో ఇచ్చినట్టు మాట్లాడుతున్నావు. మా వాడు కిరాణా కొట్లో గుమస్తా అనుకు న్నావా? గవర్నమెంటు బ్యాంకులో క్లర్కు. ఇంజినీర్లు, డాక్టర్ల తరు వాత వీళ్ళకున్న విలువ ఇంకెవరి కుందే? పక్క వీధి పాపాయమ్మ కొడుక్కి ఏభైవేలు కట్నం పలి కింది. ఎందుకూ మేమూ చేసేం ముష్టి వెధవ సంబంధం! మీ నాన్న నుండి మరో పది వేలు ఎలా రాబెట్టాలో నాకు తెలు సులేవే - చూస్తావుగా" అని కోపంతో దుర్గమ్మ బెదిరించింది.

ఆ నాటి నుంచి చీటికి మాటికీ తిట్టడం, 'శనిలా దాపరించేవ్' అని ఈసడించు కోవడం మొద లయ్యాయి. క్రమేపీ సరోజ బయ టకు పోవడం అరికట్టబడింది.

సంవత్సరం గడిచే సరికి అత్త గారితో బాటు భర్త కూడా శత్రు వయ్యేడు. మామ గారికి మొర పెట్టుకున్నా ప్రయోజనం లేక పోయింది. 'సర్దుకు పోవమ్మా' అని అతగాడు తిరిగి కోడలుకే బోధించేడు.

మరి కొన్నాళ్ళకు అత్తగారు మాటలతో పోనీయక చెయ్యి చేసుకోడం మొదలెట్టింది. ఓ నాడు కోపం పట్టలేక సరోజ కొడ్తుంటే ఓ తోపు తోసింది. అంతే బక్కలాగున్న దుర్గమ్మ కిందపడిండి. పెడబొబ్బలు పెట్ట నారం భించింది. తన నెవరో చంపేస్తున్నట్టు అంతే - ఆ సాయంత్రం ఆఫీసు నుండి తిరిగొచ్చిన నాగరాజు తల్లి చెప్పిన మాటలువిని భార్యను గొడ్డును బాదినట్టు బాదేడు. సరోజ రెండు రోజులకు గావి లేవలేక పోయింది.

తరువాత ఓ నాడు దుర్గమ్మ అకారణంగా రెచ్చిపోయింది. "ఏమే! మీ నాన్న నువ్వు రాసినా డబ్బు పంపలేదు కదూ? పైగా నువ్వు నాకు ఎదురు తిరుగుతు న్నావు కదే. పోవే మీ పుట్టింటికి పోయి, మీ నాన్ననడిగి ఆ పది వేలు తెస్తేగాని ఈ గడప మరి ఎక్కకు."

"నేనెక్కడికీ పోను. వెళ్ళినా ఫలితం వుండదు. మా వాళ్ళు మరి నాకు డబ్బివ్వలేరు".

తల్లీ కొడుకు ఆ జవా బుకు రెచ్చిపోయి సరోజను మళ్ళీ తన్నేరు. ఎలాగో అన్ని బాధల్ని ఓర్చుకొని మరో ఆరు నెలల్ని గడపగల్గింది. కాని రాను రాను ఆమె జీవితం దుర్భరం కాజొ చ్చింది.

ఒక నాటి రాత్రి నాగరాజు బాగా త్రాగొచ్చి సరోజ ఏదో అందని, ఒళ్ళు మరచి సరోజను తన్న నారంభించేడు - "అవునే అవును - పేకాటలో చాల ఓడి పోయేను. క్లబ్బులో బాకీ పడ్డాను. బారులో కూడా చాల బాకీ వున్నాను. ఏమంటావు? ఆ అప్పలన్నీ నువ్వు తీరుస్తావా? పైగా నేను త్రాగొచ్చేనని అసహ్యించు కుంటున్నావా? నా ఇల్లు - నా ఇష్టం. నువ్వెవర్తివే నన్నడ గడానికి?"

"ఒరే! అది తల్చుకుంటే నీ అప్ప లన్నీ తీర్చ గలదురా. వాళ్ళ నాన్న నడిగి ఆ పదివేల రూపాయిల్ని తెమ్మంటే సరి" అని దుర్గమ్మ అగ్నిలో మరో సమిధను వేసింది. కోడలు వేపు శాడిస్టులా చూస్తూ.

"అయితే పుట్టింటికి పోయి ఆ డబ్బును తేవే" అని నాగరాజు మరో తన్ను తన్నేడు.

"మీరు నరకండి, చంపండి గాని నేను మరి పుట్టింటికి పోను. వాళ్ళకు దుఃఖాన్ని కల్గించలేను".

"అయితే ఈ ఇంట్లోనే చావవే నా చేత దెబ్బలు తింటూ" అదీ నాగరాజు ప్రేమ సంభాషణ.

"చూడవే కోడలా! అయితే నీ చావు వంటింటి పొయ్యి దగ్గరో, పెరటి నూతిలోనో ఖాయమే. మరి ఆలోచించుకో," అని అత్త గారి ఆదరాభిమానం.

దెబ్బలతో ఒళ్ళు కమిలి లేవలేక మూలుగుతూ గదిలో ఓ మూల పడున్న సరోజను ఆ మరునాడు గదిని తుడిచి శుభ్రం చేయడా నికి వచ్చిన పని మనిషి మంగమ్మ చూసి విచారించింది. ఆ సరికి దుర్గమ్మ ఇంట్లో లేదు.

"ఏమిటమ్మా ఇది? ఎలాగో చెర విడిపించుకుని పుట్టింటికి పోక, ఏం బావు కుందామని మళ్ళీ ఈ నరకంలోనే వున్నావు? పైగా డబ్బు కూడా తెచ్చిచ్చేడు మీ నాన్న. పులికి నరమాంసం రుచి చూపిం చినట్లే కదా! మళ్ళీ తెప్పించు అని విసిగిస్తూనే వుంటారు. నిన్ను చంపుతేనే గావి వాళ్ళకు తృప్తి వుండదు. నువ్వు పోతే ఆ కొడుక్కి ఆ అసిరమ్మ మరో పెళ్ళి చేస్తుంది. మళ్ళీ బోలెడంత కట్నం. నేను నీలా చదువుకోక పోయినా, ఓ మార్గం చెప్తానిం టావమ్మా?"


"చెపవే మంగా! నాకు చావా లని లేదే! ఏం చెయ్యమంటావో చెప్పు" అని హీనస్వరంతో సరోజ అంది.

ఈ లోగా ఆ గదిలోకి సరోజ ఆడపడుచు జ్యోతి వచ్చింది, పని మనిషి మంగమ్మ లేచి వించుంది.

"కోడలమ్మా! మెల్లగాలే. అలా ముక్కుతూ, మూలుగుతూ పడు కుంటే లాభం లేదు. నేను వేడి నీళ్ళు పెట్టిస్తా, లేస్నానం చేద్దు

(తరువాయి 58వ పేజీలో)

## చిట్కా




* ఫ్రూట్ కేక్‌లు తయారు చేసినపుడు తాజాగానే వుంటాయి. కానీ ఎక్కువ రోజులు తాజాగా వుండవు. ఎక్కువరోజులు తాజాగా వుండాలంటే ఫ్రూట్ కేక్స్ తయారుచేసేటప్పుడు స్వచ్ఛమైన గ్లిజరిన్ తగు పాళ్ళలో జోడించాలి. ఇలా చేస్తే మెత్తగా, తాజాగా ఎక్కువ రోజుల పాటు ఫ్రూట్ కేక్‌లు నిలువ ఉంటాయి.

—ప్రియా సరస్వతి, హైదరాబాద్.

(౨ వ పేజీ తరువాయి)

వుగాని, ఆ నొప్పులూ, బాధలు అవే పోతాయిలే" అని మెల్లగా లేవనెత్తి సరోజను పెరటి లోనికి తీసుకుని వెళ్ళింది.

మరో వారం రోజులకు గాని సరైన అవకాశం చిక్కలేదు. నాగరాజు ఆఫీసుకి పోయేడు. దుర్గమ్మ, ఆమె భర్త, కూతురు జ్యోతి "విచిత్ర హంతకులు" అనే మహత్తర తెలుగు సినీమా చూడడానికి మేటనీకి పోయేరు. ఇంట్లో కోడలు సరోజ, పని మనిషి మంగమ్మ వున్నారు. మంగమ్మ హితబోధ చేయ నారంభించింది.

"సరోజమ్మా! మీ పెద్దింటి వారికి, రెక్కాడితే గాని డొక్కాడని మాకూ ఇదే బేదమమ్మా. మీలా మేము చచ్చుగా పడి వుండమమ్మా. పరిస్థితులు సవ్యంగా వుండి, కట్టుకొన్న మొగుడు సజావుగా వుంటే వాడికై ప్రేమను ఇచ్చి, ఇష్టంగా కాపురం చేస్తాం. లేకుంటే ఇట్టే విడిపోతాం. నేను గత రెండు సంవత్సరాలై మొగడితో వేరు పడిపోయేను. ఎందుకో తెలుసా? వాడు రిక్షా తొక్కి రోజుకి పాతిక రూపాయిలకు తక్కువ కాకుండా ఆర్జించే వాడు. కాని నా చేతిలో అయిదు రూపాయల్ని మాత్రమే పెట్టి మిగతా డబ్బంతా త్రాగుడుకి ఖర్చు చేసే వాడు. అంతేకాక పాడు ముండల పాకల లోకి దూరి డబ్బును తగలేసేవాడు. అక్కడితో ఊరుకోక నాడబ్బును తీసుకుని ఏ రాత్రికో తప్పతాగొచ్చి నన్ను ఏదో నెపం మీద బాదే వాడు.

"అయ్యో మంగా! నీ బతుకూ బండలయిందా?"

"కాని సరోజమ్మ నేను ఎక్కువకాలం సహించలేదు. రెండు సంవత్సరాలు చూసేను. వాడికి దయానా, భయానా ఎంతో చెప్పేను. నా మాటలేమీ వాడు వినిపించుకో లేదు. అంతే మా కులపుటోళ్ళకు చెప్పేను. మా కుల పెద్దకి ముడుపు కట్టేను. మా పెళ్ళిని రద్దు చేసేసేరు. నా బ్రతుకును నేను హాయిగా బ్రతుకుతున్నా. నా ఈ చిన్న పొట్టకు నాలుగిళ్ళల్లో పని చేసుకుంటే ఇంత తిండి దొరకుతోంది".

"మరి నీ మొగుడు అప్పడప్పుడు వచ్చి గొడవ చేయ్యడూ?"

"వాడు మాజీ మొగుడయిపోయేడు కదమ్మా. వాడు నా గుడిశ దగ్గరకొస్తే నేనొక కేక వేస్తే చాలు మా కులపుటోళ్ళు వచ్చి వాణ్ణి తగిలేస్తారు. అందుకే వాడు మరో పేటకు పోయేడు."

"నీ పాటి చొరవ నాకులేదే! పైగా ఈ సమాజానికి భయపడి ఇలా చస్తున్నా"

"మీ పెద్దింటి వారు. ఎందుకు కొరగాని గౌరవ ప్రతిష్టలకి ఇచ్చే విలువ కనుక్కొన్న పిల్లల ప్రాణాలకు ఇవ్వరు కదమ్మా".

"నువ్వన్నదంతా నిజమే మంగా. మరి నన్నిప్పుడేం చెయ్యామన్నావో చెప్పు. నాకు పుట్టింట్లో స్థానం లేదు. అత్త వారింట్లో అంతకన్నా లేదు. ఇక్కడింకా నేనుంటే ఈ దుర్మార్గులు ఎప్పడై నా నన్ను చంపేస్తారు. మరి నేనిప్పుడు ఎక్కడికి పోగలను చెప్పు" అని కన్నీటితో అడిగింది.

"చెప్పడమే కాదమ్మా, నేను మీకన్ని విధాల సహాయ పడ్తాను కూడా"

ఆ మాటకు సరోజ హృదయం చలించి ఎంతో ఆర్ద్రతతో మంగ చేతుల్ని పట్టుకుంది.

"సరోజమ్మా! నేను పక్క పేటలో ఓ ప్లీడరు గారింట్లో పని చేస్తున్నాను. ఆ పెద్దతను చాలా మంచివారు. ఆయమ్మగారు చాల దయగల మనిషి. వారిరువురికీ మీ కష్టాలను చెప్పేను. మీరిప్పుడెలాంటి ప్రమాదస్థితిలో వున్నారో చెప్పేను. వారి మనసు కరిగింది. మిమ్మల్ని తెమ్మన్నారు. మీకు సహాయ పడ్తామన్నారు. ఈ దుష్టుల బాధలేకుండా చూస్తామన్నారు. పదండమ్మా! ఇదే మంచి అవకాశం. మీ అత్తవారెవరూ ఇంట్లో లేరు కదా. మీ బట్టల్ని తీసుకుని నాతో పదమ్మా. ఈ ఇంటికి తాళం వేసి ప్రక్కింటి ఈశ్వరమ్మగారికి ఏదో పని మీద పోతున్నట్టు చెప్పి తాళ్ళం ఇచ్చేసి రండి" అని బోధించింది మంగమ్మ,

వెంటనే సరోజ తన బట్టల్నీ, తన సర్టిఫికేట్లనూ ఓ సూటు కేసులో పెట్టుకుని, అత్తవారింటికి గుడ్‌బై కొట్టేసి, తన్ను ఆదుకుంటున్న పని మనిషి మంగమ్మతో ప్లీడరు గారింటికి ఆటోలో బయలుదేరింది.

ఆ ఇంటికి చేరగానే మంగమ్మ సరోజను ఆ ప్లీడరుగారి భార్యకు పరిచయం చేసింది. ఆమె ఆదరంతో సరోజను ఇంట్లోకి తీసుకుని వెళ్ళింది. మరో గంటకు ప్లీడరు మధుసూధనం గారు కోర్టు నుండి వచ్చేరు. వారిని చూడగానే సరోజ కన్నీళ్ళు ఆగలేదు.

"ఏడవకమ్మా! నీ సంగతి మంగమ్మ చెప్పింది. ఈ నాటితో నీ కష్టాలు తీరేయనుకో".

"మీరూ, అమ్మగారు నా తల్లి తండ్రుల కన్న మిన్నగా నన్ను ఆదుకుంటు న్నందుకు నేను కృతజ్ఞరాలను. కాని సార్! నాకో విషయం అర్థం కావడం లేదు చెప్పండి — నా భర్త నన్నెందుకు అసహ్యించుకుంటున్నాడు. నా అత్తగారికి నా మీద ద్వేషమెందుకు?"

ఓ నిమిషం మధుసూధనంగారు ఆలోచించి చెప్పనారంభించేడు—

"మంగమ్మ చెప్పిన విషయాన్నీ విన్న తరువాత నీ అత్తింటి కుటుంబ సభ్యులను ఊహించుకోగలేను. వారి నడవడిని తెలుసుకోగల్గేను. నువ్వు చాలా సాధు స్వభావం గల యువతివి. నీ భర్త చాల దుష్టుడు. నీ భర్త మంచి వాడైతే, నిన్ను ప్రేమించి నీలోని చక్కదన్నాన్ని నీ సహృదయతను తెలుసుకోగలిగే వాడు. కాని ఈ నాగరాజు పైభామల్ని మరిగిన వాడు. వక్రబుద్ధి కలవాడు. అట్లాంటి వ్యసన పరుడు సుఖాన్వేషణే గాని కట్టుకున్న భార్యలోని అనురాగాన్ని మమతను, మాధుర్యాన్ని తెలుసుకోలేదు. ఇక మీ అత్త సంగంతంటావా— ప్రతి తల్లి తన కొడుక్కి వివాహం కాగానే, తన అనురాగాన్ని వదిలి తన కొడుకు కోడలు ప్రేమలో పడ్డాదే

## చిట్కాలు



* జలుబు చేసినప్పడు ముక్కుమూసుకు పోతే ఆవనూనె ముక్కు లోపల రాయండి.

* ఒక కేజీ గోధుమలలో 100 గ్రాములు శనగలు, 100 గ్రాములు సోయాబీన్స్ వేసి మూడింటినీ కలిపి పిండిచేసి (మరపట్టించి) ఆ పిండితో చపాతీలు చేసి తింటే రుచిగా వుంటాయి.

— కుమారి పి. విజయకుమారి,
మద్రాస్

## తొలి మహిళలు

* 1972 సం. ఒలింపిక్స్‌లో క్రీడాకారుల తరుఫున మొదట ప్రతిజ్ఞ చేసిన మహిళ–హర్డిల్ ఛాంపియన్ అయిన – హెమిడె షుల్లర్

* ఇండియాలో స్త్రీల కోసం స్థాపించిన బెంగుళూర్‌లో మ్యూజియం పేరు 'శాశ్వత మ్యూజియం'

* అమెరికా కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్టిగేషన్స్ సభ్యత్వం పొందిన తొలి ఆసియా మహిళా డిటెక్టివ్–రాజ్‌దులారిసింగ్

* ప్రపంచంలో అతి పొడవైన మహిళ 'శాండి అలెన్' 7 అడుగుల 1/4 అంగుళాలు

* 1876లో **Medical Degree** పొందిన తొలి మహిళ ఎడిన్‌బర్గ్‌లోని సోఫియా జెక్స్‌బ్లేక్

* బొంబాయిలోగల లోకమాన్య తిలక్ మెమోరియల్ హాస్పటల్ 'మానవ దుగ్ధకోశము' పేరున తల్లి పాల బ్యాంక్ ఏర్పాటు చేసిన అఖిలభారత స్థాయిలో మొదటి మహిళ–డా. ఆర్మిడా ఫెర్నాడిస్

* 1992 సం.లో ఒలింపిక్స్ క్రీడలందు డ్రగ్స్ వాడినట్లు పట్టుబడిన తొలి మహిళా వాలీబాల్ క్రీడాకారిణి 'ఫుడాన్' (చైనా) కాని ఈమెకు ముందు 1904 సెయింట్ లూయిస్ ఒలింపిక్స్‌లో డ్రగ్స్ వాడినట్టు తెలిసినప్పటికి క్రీడలలో నుండి బహిష్కరింపబడలేదు కారణం ఆనాడు ఇట్లాంటి డ్రగ్స్ పరీక్షలు లేవు. ఇంతకీ ఆమె పేరు – థామస్ హిక్స్.

* ఒలింపిక్స్‌లో అతి తక్కువ వయసులో (16 సం.) బంగారు పతకాన్ని టెన్నిస్ క్రీడలో 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌నందు గెలిచిన క్రీడాకారిణి అమెరికాకు చెందిన 'కాప్రియాటీ'

* హాలెండ్‌లో 'హఠయోగ థియరిని' డచ్ భాషలో చెప్పిన మొదటి భారత వనిత–శ్రీమతి సుధా అయ్యంగార్

* మహిళలను మోటారు వాహనాలు నడుపరాదని నిషేధించిన తొలి దేశం – సౌది అరేబియా

* 1942 ఆగస్ట్ 8న 'క్విట్ ఇండియా ఉద్యమం'లో పాల్గొన్న ప్రముఖ స్త్రీలు–అరుణా అసఫాలీ. సుచేత కృపాలనీ, ఉషామెహతా మొ.వారు

* 1958 సం.లో ఢిల్లీ మొదటి మహిళా మేయర్–"అరుణా అసఫాలీ"

సేకరణ: ఎం.వి.ఎ.

---

అన్న ప్రకృతి సహజమైన అసూయకు గురౌతుంది. కాని ఉత్తమురాలైన తల్లి ఆ కొడుకు అభిమానాన్ని పంచుకొని, కొడుక్కి స్త్రీపరంగా జనించిన ప్రేమను తన కోడలికి వదిలి శాంతిని పొందుతుంది. తనూ ఒక నాటి కోడలే అని మరువక ఆ కోడలిని ఆదరిస్తుంది. కానీ నీ అత్త పరమ దుష్టురాలు. బుద్ధిలేనిది. ఆమె మనసంతా విషమే. అందుకే ఆ భర్త కూడ ఆమెకు దూరంగ్రబతుకుతున్నాడు. అట్లాంటి వారు ఎవ్వర్నీ ప్రేమించలేరు, ద్వేషించడం తప్ప. అదో విషవలయం. అందులోంచి నువ్వు బయట పడడమే మేలు"

"అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటారో చెప్పండి – ఓ సారి మా నాన్నగారు నాకిచ్చిన అయిదు వందల్ని నేను రహస్యంగా దాచుకున్నాను. ఆ డబ్బునే ఇప్పుడు నాతో తెచ్చుకున్నాను. మెడలో ఈ ఒంటిపేట గొలుసూ, చేతికి ఓ జత గాజులూ నా దగ్గరున్న ఆస్తంతా. ఇవి నా పుట్టింటి వారు ఇచ్చినవే, అత్తవారివి కావు".

"గుడ్! రేపు గవర్నమెంట్ హాస్పటిల్‌కు వెళ్దాం. అక్కడ లేడీ డాక్టరుకీ నీ భర్త, నీ అత్త ఎలా నిన్ను శారీరకంగా హింసించిందీ చెప్పి, నీ ఒంటి మీదున్న దెబ్బల మచ్చల్నీ, వాతల్నీ చూపించి ఓ సర్టిఫికెట్ తీసుకుందాం. దానితో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి, నీ అత్తవారు నిన్ను బాధించి, ఎలా చంపబూనుకున్నారో వివరంగా తెలియజేస్తూ ఓ కంప్లెయింట్ ఇద్దాం, పోలీసు రక్షణ కోరుతూ దానితో నీ అత్తవారి ఆట కట్టుతుంది. పోలీసులు వారిపై చర్య తీసుకుంటారు"

"ఆ దుర్మార్గులికి తగిన శిక్ష పడాలి సార్!" అంది సరోజ.

"అది పోలీసులు పెట్టే కేసుపై ఆధారపడుతుంది. ఏది ఏమైనా పోలీసులు నీ అత్తవారిని జల గల్లా పట్టుకుని నానా యాతన పెడ్తారు. ఈ జన్మలో నీ జోలికి పోకుండా నీ భర్తను కట్టడి చేస్తారు.

"నాకు కావల్సింది అదేనండి. రేపు నేను నా స్నేహితుడుతో మాట్లాడుతాను అతనో పెద్ద ఇండస్ట్రియలిస్ట్. వారి ఇండస్ట్రీస్‌కి నేను కన్సల్‌టింగ్ అడ్వకేటుని. నా మాటను కాదనడు. నువ్వెంత వరకు చదువుకున్నావు?"

"నేను బి.ఎ. పాసయ్యాను సార్. ఇంగ్లీషు టైప్ రైటింగ్ లోయర్ పాసయ్యాను"

"వెరీగుడ్ – అతని ఆఫీసులో నీకు క్లర్క్ ఉద్యోగమిప్పిస్తాను. ఎంత లేదన్నా ఓ వెయ్యి రూపాయిల వరకు జీతముంటుంది. నేనితనితో మాట్లాడేక రెండు రోజులు పోయేక నువ్వెళ్ళి అతని ఆఫీసులో నీ సర్టిఫికెట్లతో కలియవచ్చు. నీకు ఉద్యోగం వచ్చి, నువ్వు స్థిరపడే వరకు నువ్వు మా ఇంట్లో ఏ సంకోచం లేకుండా వుండొచ్చు. నా పిల్లలంతా పెద్ద వాళ్ళయి పోయేరు. పెద్ద పెద్ద ఉద్యోగాలలో చేరి దూరంగా పైదేశాలలో వుంటున్నారు. నిన్ను మేము కూతురుగా భావిస్తాము. నువ్వు మాకేమీ బరువు కాదు. పైగా నువ్వు మాకు తోడుగా వుంటావు. నిన్ను ఆదుకోకపోతే ఈ మంగమ్మ గొడవ చేస్తుంది"

"అదేమీ కాదు బాబూ! మీరు అమ్మగారూ బహుమంచి వారు. అందుకే సరోజమ్మను రక్షిస్తున్నారు"

"చూడమ్మ సరోజ! నీకెప్పుడైతే మా ఇంట్లో వుండడం ఇబ్బందిగా తోస్తే, అప్పుడు నువ్వు వర్కింగ్ గరల్స్ హాస్టల్‌లో వుండొచ్చు". సరోజ రెండు చేతులూ ఎత్తి వారికి నమస్కరించింది కృతజ్ఞతో కన్నీరు కారుస్తూ.

మీ కెప్పుడైనా అలా విడాకులు తీసుకుని, తన బ్రతుకును తను బ్రతుకు తున్న యువతి ఎదురైతే వింతగా చూసి, ఏమేమో వక్రంగా ఊహించుకోక సానుభూతిని చూపండి. అవసరమైతే తోడబుట్టిన వారిలా సహాయ పడండి! ఆమె జీవితాన్ని ప్రశాంతంగా పోనివ్వండి.